

వందశాతం వసూలు చేయండి

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఈనెలాఖరులోపు ఇంటి పన్నులు వంద శాతం వసూలు చేయాలని డీపీవో వీరబుచ్చయ్య సూచించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని(సా॥)	సహర్ ఆది(ఉ॥)
కరీంనగర్	6.27	4.48
పెద్దపల్లి	6.34	4.56
రాజన్న సిరిసిల్ల	6.34	4.56
జగిత్యాల	6.34	4.55

గరిష్ఠం/కనిష్ఠం
37.0/23.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ ఉంటుంది. రాత్రి వేళ చలిగాలి వీస్తుంది.

న్యూస్‌రీల్

వ్యాధులపై అప్రమత్తం

● డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు



అవగాహన కల్పిస్తున్న సుమన్‌మోహన్‌రావు

సిరిసిల్లటౌన్: కీటక జనిత వ్యాధులపై వైద్యాధికారులు, సిబ్బంది, ఆరోగ్యకార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో సుమన్ మోహన్‌రావు ఆదేశించారు. తన ఆఫీస్‌లో శుక్రవారం పీహెచ్‌సీల ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన కల్పించారు. మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియా, ఎంఏఆర్‌ఐవైయా జపనీస్, ఇన్‌సెఫిలిటీస్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీరాములు, డిప్యూటీ డీఎంహెచ్‌వో రజిత, వైద్యులు నయీమ, లింగం, మోహన్, రాజ్‌కుమార్, బాలయ్య, భూమయ్య, సోనీ, మని పాల్గొన్నారు.

ఇసుక రీచ్ నిలిపివేయాలి



తహసీల్దార్‌కు విన్నవిస్తున్న బొల్లారం గ్రామస్తులు

వేములవాడరూరల్: వేములవాడ మండలం బొల్లారం–లింగంపల్లి గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను నిలిపివేయాలని ఆ గ్రామానికి చెందిన రైతులు రూరల్ తహసీల్దార్ సుజాతకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గత వర్షాకాలంలో నీటి ప్రవాహంతో ఈ ప్రాంతంలో ఉన్న ఇసుక కొట్టుకుపోయిందన్నారు. అదే ప్రాంతంలో మళ్లీ ఇసుక రీచ్ ఏర్పాటు చేస్తే ఇక్కడున్న ఆలయానికి, గ్రామస్తులకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందన్నారు. వెంటనే అనుమతులు రద్దు చేయాలని కోరారు.

ఇసుక అనుమతులపై ఆందోళన

కోనరావుపేట(వేమువాద): మండలంలోని మామిడిపల్లిలో ఇసుక రవాణాకు అనుమతుల విషయంపై గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమానులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ మామిడిపల్లిలో సుమారు 40 ట్రాక్టర్లు ఉంటే.. శుక్రవారం ఐదు ట్రాక్టర్లకే అనుమతి ఇచ్చారన్నారు. డీడీలు చెల్లించినప్పటికీ మిగతా వారికి అనుమతి ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసీల్దార్ విజయప్రకాశ్‌రావును వివరణ కోరగా రెవెన్యూ సిబ్బంది తక్కువగా ఉన్నందున కొందరికే పర్మిషన్ ఇచ్చామన్నారు. రోజు కొంతమందికి ఇస్తామని స్పష్టం చేశారు.

హైడ్రోపోనిక్స్ సందర్శన



వ్యవసాయ కళాశాలలో హైడ్రోపోనిక్స్ ప్రాజెక్టు సందర్శిస్తున్న నాబార్డు అధికారులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల శివారులోని బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాలలో చేపట్టిన హైడ్రోపోనిక్స్ ప్రాజెక్టును శుక్రవారం నాబార్డు అధికారులు సందర్శించారు. నాబార్డు డీజీఎం స్వాతి తివారి, ఏజీఎం జయప్రకాశ్, కరీంనగర్ క్లస్టర్ డీడీఎం మనోహర్‌రెడ్డి ప్రాజెక్టును పరిశీలించారు. శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.శ్రీదేవి, ఇన్వెస్టిగేటర్లు భవ్యశ్రీ, సతీశ్ ప్రాజెక్టు గురించి వివరించారు.

ఎర్త్ అవర్‌లో భాగస్వాములు కావాలి

బోయినపల్లి(చొప్పదండి): పర్యావరణ పరిరక్షణకు ఈనెల 23న నిర్వహిస్తున్న ఎర్త్ అవర్‌లో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యులు కావాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి సంపతి రమేశ్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. శనివారం రాత్రి 8.30 నుంచి 9.30 గంటల వరకు లైట్లు ఆపివేసి సహకరించాలని కోరారు. పారిశ్రామికీకరణ, పట్టణీకరణతో భూవాతావరణం కాలుష్యానికి గురవుతుందన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

సిరిసిల్లక్రైం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్‌ఐ రమేశ్ కోరారు. సిరిసిల్లలోని ప్రధాన కూడళ్ల వద్ద శుక్రవారం ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పించారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ తనిఖీ చేశారు. హెల్మెట్, సీటుబెల్టు లేకుండా, మద్యం సేవించి, నిర్లక్ష్యంగా వాహనాలు నడపవద్దని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదన్నారు.

పొలాలు ఎండుతున్నాయి



ఎండిన వరి పొలంలో దీనంగా నిల్చున్న ఇతను లకావత్ పంతులు నాయక్. ముస్తాబాద్ మండలం సేవాలాల్‌తండాకు చెందిన గిరిజన రైతు. రెండు బోర్లు ఉండడంతో తనకున్న మూడెకరాల్లో యాసంగి సీజన్‌లో వరిపంట వేశాడు. రూ.45వేలు పెట్టుబడిగా పెట్టాడు. పొలం పొట్టదశలో ఉండగా.. నీరందక బోరు ఎండిపోయింది. ఆ బోరును రూ.లక్ష వెచ్చించి ఫ్లషింగ్ చేయించాడు. కానీ నీటి ఊట పెరగలేదు. దీంతో మూడెకరాల పొలం ఎండిపోయింది. మరోచోట ఎకరం పొలాన్ని కౌలుకు తీసుకుని సాగుచేస్తే.. ఇటీవల కురిసిన రాళ్ల వానలతో ఆ ఎకరం నేలవాలింది.



ఎండిన వరి పొలంలో నిల్చున్న ఇతను ద్యావల శంకర్. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన శంకర్‌కు రెండెకరాల పొలం ఉంది. బావి కింద ఆ రెండెకరాలు సాగుచేశాడు. మార్చి నెలలో ఒక్కసారిగా భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బావి ఎండిపోయింది. యాసంగి సీజన్‌లో సాగుచేసిన రెండు ఎకరాలు మొత్తం ఎండిపోయింది. పొట్ట దశలో పొలం ఎండిపోవడం శంకర్‌ను ఆవేదనకు గురిచేసింది. మరో పక్షం రోజులు పొలం పారితే పంట చేతికి అందేది. కానీ పొలం ఎండిపోవడంతో సాగుకు పెట్టిన పెట్టుబడి రూ.50వేలు మీద పడింది.



ఇతను కోనరావుపేట మండలం మరిమడ్లకు చెందిన శ్రీగాధ వేణు. మూడు ఎకరాల్లో వరి పంట వేశాడు. పది రోజుల కిందట బోరు ఎత్తిపోయింది. దీంతో పొలానికి నీరు లేక మూడెకరాలు బీటలు వారింది. పొలమంతా పొట్టదశలో ఉంది. మరో 20 రోజులు నీరు పారితే.. పంట చేతికొచ్చేది. కానీ భూగర్భజలాలు పడిపోవడంతో ఒక్కసారిగా బోరు ఎత్తిపోయింది. వరి పంటపై వేణు ఆశలు అడుగంటిపోయాయి.



ఎండిన వరి పొలాన్ని చూపుతున్న ఈ రైతు పేరు తేజావత్ దేవ్. వీర్నపల్లి మండలం భూక్యాతండా శివారులోని రాసిగుట్ట తండాకు చెందిన దేవ్ కౌలురైతు. స్థానిక రైతు వద్ద మూడెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని సాగుచేశాడు. పాత బావిలోని నీటితో పొలం పారేది. కానీ ఆరుగాలం శ్రమించి రూ.60వేలు పెట్టుబడిగా పెట్టాడు. చి'వరి'కి ఆ పొలం నిలువునా ఎండిపోయింది.

ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో రైతు ఎండిన పొలాన్ని తగులబెట్టి నిరసన తెలిపారు. వరి పొలంలో ఎడ్లు, గొర్రెలను మేపుతున్నారు.



ముస్తాబాద్ మండలం సేవాలాల్‌తండాలో ఎండిన పొలంలో మేస్తున్న మేకలు

- అడుగంటిన 'నీటి'ఊటలు
- ఎత్తిపోయిన బోర్లు.. ఎండిన వరిమళ్లు
- వీర్నపల్లిలో 15.50 మీటర్లకు పడిపోయిన భూగర్భ జలాలు
- శరవే'గంగా' పాతాళానికి..



కోనరావుపేట మండలం ధర్మారం శివారులో ఎండిన వరిపొలంలో మేస్తున్న గొర్రెలమంద

సిరిసిల్ల: జిల్లాలో వానాకాలం సీజన్‌లో సాధారణం కంటే మెరుగైన వానలు పడ్డాయి. చెరువులు, కుంటల్లో నీరు చేరడం, వాగులు పారడంతో రైతులు విరివిగా వరి సాగు చేశారు. వ్యవసాయానికి 18 గంటల విద్యుత్ సరఫరా ఉండడంతో రైతులు వరిపై ఆశలు పెట్టుకున్నారు. జిల్లాలో 1,73,742 ఎకరాల్లో వరి సాగుచేశారు. విస్తీర్ణం పెరగడంతో భూగర్భ జలాలు పడిపోయి, పొలాలు ఎండిపోతున్నాయి.

జిల్లాలో వ్యవసాయ స్వరూపం

వ్యవసాయ కనెక్షను	74,754
సాగైన వరి	1,73,742.28 ఎకరాలు
బోరు	41,104 (చాలా బోర్లు ఎండిపోయాయి)
బావులు	28,124(ఎక్కువ బావులు వట్టిపోయాయి)
రైతులు	84,109

నీటినిల్వలు తగ్గిపోయి

జిల్లా వ్యాప్తంగా నీటి వనరుల్లో నిల్వలు తగ్గిపోయాయి. గతేడాది కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా గోదావరి జలాలు ఎత్తిపోశారు. ఈ ఏడాది ఎత్తిపోతల ఊసే లేకపోవడంతో జిల్లాకు గోదావరి జలాలు రావడం లేదు. బోయినపల్లి మండలం మధ్యమానేరు జలాశయంలో 9 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇల్లంతకుంట మండలం అనంతగిరి అన్నపూర్ణ ప్రాజెక్టులో నీరు లేదు. గంభీరావుపేట ఎగువమానేరులోకి గోదావరి జలాలు రాలేదు. కోనరావుపేట మండలం నిమ్మపల్లి మూలవాగులోనూ నీటిమట్టం తగ్గింది. మల్కపేట రిజర్వాయర్‌లో ఒక్క టీఎంసీ నీరు మాత్రమే ఉంది. జిల్లాలో బావులు, బోర్ల ద్వారా నీటి వినియోగం పెరిగి భూగర్భ జలాలు పడిపోయాయి. ఎంతో కాలంగా సాగునీరు అందించిన బోర్లు సైతం ఈసారి ఎండిపోయాయి. దీంతో రైతులు మళ్లీ మళ్లీ బోర్లు వేస్తూ పంటను కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు.

జిల్లాలో భూగర్భ జలాలు ఇలా.. (మీటర్లు.. లోతులో)

మండలం	2023 ఫిబ్రవరి	2024 ఫిబ్రవరి
బోయినపల్లి	6.35	6.57
చందుర్తి	4.83	7.01
గంభీరావుపేట	7.71	9.65
ఇల్లంతకుంట	6.18	7.85
కోనరావుపేట	7.74	9.87
ముస్తాబాద్	9.35	13.26
రుద్రంగి	4.60	7.53
సిరిసిల్ల	10.55	12.71
తంగళ్లపల్లి	6.91	10.71
వీర్నపల్లి	13.52	15.50
వేములవాడరూరల్	7.04	5.37
వేములవాడఅర్బన్	13.59	13.58
ఎల్లారెడ్డిపేట	5.03	15.02
జిల్లా సగటు	7.94	10.18

భూగర్భ జలాలు పడిపోయాయి



జిల్లాలో గతంతో పోల్చితే భూగర్భ జలాలు పడిపోయాయి. నీటి వినియోగం పెరిగింది. అవసరానికి మించి భూగర్భ జలాలను తోడేస్తున్నారు. మార్చి నెలాఖరు వరకు మరింత లోతుకు భూగర్భ జలాలు పడిపోతాయి. గత ఏడాది ఫిబ్రవరితో పోల్చితే 2.24 మీటర్ల లోతుకు నీటిమట్టం పడిపోయింది. నీటిని పొదుపుగా వాడుకుంటేనే అందరికీ మంచిది.

– నర్సింహులు, జిల్లా భూగర్భ జలశాఖ అధికారి

వేములవాడ పోలీసులపై వేటు ?

● బహిర్గతం చేయని అధికారులు

సిరిసిల్లక్రైం: వేములవాడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందిలో ఏకంగా పది మందిపై వేటుపడినట్లు తెలిసింది. ఒకే ఠాణా నుంచి ఒకేసారి ఇంత మందిపై వేటుపడడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వేములవాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేసే పది మందిలో కానిస్టేబుళ్లు, హోంగార్డులను జిల్లా పోలీస్ కార్యాలయానికి అటాచ్ చేసినట్లు సమాచారం. దీనిపై సంబంధితశాఖ అధికారులను వివరణ కోరితే.. అంతర్గత బదిలీ అని, ఇది సాధారణ అంశమేనని దాటవేత ధోరణిలో సమాధానం ఇస్తున్నారు. ఎన్నికలకు ముందు జరిగే బదిలీలు అనుకుంటే అందులో ఎవరూ స్థానికత ఉన్న వాళ్లు లేరు. అంతేకాకుండా మూడేళ్ల సీనియారిటీ కూడా నిండలేదు. మరీ ఎందుకు వేటువేశారని శాఖలోనూ అంతర్గతంగా చర్చ సాగుతోంది.

వేములవాడ.. హాట్.. హాట్

వేములవాడ ఆధ్యాత్మిక పట్టణం కావడంతో భక్తుల రద్దీ.. వారికి అవసరమైన దుకాణ వ్యాపారాలు, అక్రమ ఇసుక రవాణాకు పెట్టింది పేరు. ఆయా అంశాల్లో స్థానికంగా పనిచేసే సిబ్బందిలో కొందరు వివాదాల్లో చిక్కుతున్నారు. క్షేత్రస్థాయిలో ఉన్నతాధికారుల పరిశీలన సరిగ్గా లేకపోవడంతో పలు సంఘటనలు వివాదాస్పదంగా మారుతున్నాయి. ఆయా సందర్భాల్లో కిందిస్థాయి సిబ్బంది బలిపశువులుగా మిగులుతున్నారు.

వడ్డీ లేని రుణాల మిత్తి విడుదల

● మహిళా సంఘాల ఖాతాల్లోకి రూ.73 కోట్లు

ముస్తాబాద్(సిరిసిల్ల): స్వశక్తి మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణంపై మిత్తిని ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలోని ఐకేపీ సంఘాలకు రూ.73.09 కోట్లు విడుదల చేసింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన డిసెంబర్ నుంచి మార్చి వరకు వడ్డీ లేని రుణ బకాయిలు అందజేసింది. ముస్తాబాద్ మండలానికి రూ.75.55లక్షలు, బోయినపల్లికి రూ.63.17లక్షలు, చందుర్తికి రూ.53.18లక్షలు, ఇల్లంతకుంటకు రూ.94.02లక్షలు, గంభీరావుపేటకు రూ.94.09లక్షలు, కోనరావుపేటకు రూ.68.15లక్షలు, రుద్రంగికి రూ.25.97లక్షలు, తంగళ్లపల్లికి రూ.82.52 లక్షలు, వీర్నపల్లికి రూ.20.87లక్షలు, వేములవాడకు రూ.27.65లక్షలు, వేములవాడ రూరల్‌కు రూ.37.75లక్షలు, ఎల్లారెడ్డిపేటకు రూ.96.73లక్షలు డీఆర్‌డీఏ అధికారులు మహిళా సంఘాలకు జమచేశారు. గత ప్రభుత్వం నాలుగేళ్లుగా వడ్డీలేని రుణాల మిత్తిని అందించలేదు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ప్రభుత్వం ఈ నిధులు అందజేసినట్లు అధికారులు స్పష్టం చేశారు.

పేదల గుండెచప్పుడు వినే ప్రభుత్వం

- వంద రోజుల్లోనే హామీలు అమలు చేశాం
- గల్ఫ్ బాధితులకు అండగా నిలిచేందుకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా
- పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు ఖాయం
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



నర్సింగపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి(వేములవాడ): రాష్ట్రంలో పేదల గుండెచప్పుడు వినే కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వంద రోజుల్లోనే నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కిందన్నారు. మండలంలోని నర్సింగపూర్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని గత ప్రభుత్వం అప్పులపాలు చేసిందన్నారు. తొమ్మిదిన్నర ఏళ్లలో పేదలకు ఇల్లు కూడా ఇవ్వలేని బీఆర్ఎస్ నాయకులు పెద్ద పెద్ద మాటలు మాట్లాడడం మానుకోవాలని హితవు పలికారు. ఇల్లు లేని నిరుపేదలకు ఎన్నికల కోడ్ ముగియగానే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామన్నారు. బీఆర్ఎస్ తొమ్మిదిన్నర పాలనలో ఒక్క గల్ఫ్ బాధిత కుటుంబాన్ని ఆదుకున్న పాపానపోలేదన్నారు. గల్ఫ్ బాధిత కుటుంబాలకు వైఎస్సార్ హయాంలో రూ.లక్ష ఎక్స్‌గ్రేషియా చెల్లించగా, సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాదవశాత్తు మృతిచెందిన కుటుంబాలకు రూ.5లక్షలు అందజేస్తున్నట్లు తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. చందుర్తి జెడ్పీటీసీ నాగం కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు చింతపంటి రామస్వామి, మాజీ ఎంపీటీసీ ఎర్రం శ్రీమన్నారాయణ, మాజీ ఉపసర్పంచ్ కాసారను శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నేతికుంట జలపతి, నాయకులు ఇల్లంతకుంట శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

దుఃఖాన్ని ఆపులేక..

చందుర్తి మండలం నర్సింగపూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు దొబ్బల శంకర్ గుండెపోటుతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను ఆది శ్రీనివాస్ పరామర్శించారు. ఆది శ్రీనివాస్ వారి ఇంటికి చేరుకోవడతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. వారి పరిస్థితిని చూసి ఆది శ్రీనివాస్ దుఃఖం ఆపుకోలేకపోయారు.

నేతకార్మికులకు టెక్స్‌టైల్ పార్క్‌లో ఉపాధి

● సిరిసిల్ల జౌళిశాఖ ఏడీ సాగర్



మాట్లాడుతున్న సాగర్

సిరిసిల్ల: పవర్‌లూమ్ వస్త్రపరిశ్రమలో సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో సిరిసిల్ల నేతకార్మికులకు టెక్స్‌టైల్ పార్క్‌లో ఉపాధి కల్పిస్తున్నట్లు జౌళిశాఖ అధికారులు శుక్రవారం వెల్లడించారు. సిరిసిల్లలో పాలిస్టర్ కార్ఖానాలు బంద్ పడి నేతన్నలకు ఉపాధి కరువైన నేపథ్యంలో తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్క్‌లో ఉపాధి అవకాశాలు ఉన్నాయని జౌళిశాఖ ఏడీ మిట్టకోల సాగర్ తెలిపారు. రాష్ట్ర జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి ఇటీవల సిరిసిల్లను సందర్శించిన సందర్భంగా టెక్స్‌టైల్ పార్క్‌లో సిరిసిల్ల కార్మికులకు పని కల్పించాలని, కార్మికుల రవాణాకు బస్సు సౌకర్యం కల్పించాలని సూచించారు. ప్రభుత్వం రాజీవ్ విద్యామిషన్(ఆర్‌వీఎం)లో భాగంగా స్కూల్ యూనిఫామ్స్ వస్త్రోత్పత్తి ఆర్డర్లు టెక్స్‌టైల్ పార్క్‌లోని యూనిట్లకు ఇచ్చారు. ర్యాపియర్ లూమ్స్ నడిపేందుకు ఆసక్తి ఉన్న కార్మికులు టెక్స్‌టైల్ పార్క్‌లోని అడ్మినిస్ట్రేషన్ భవన్‌లో సంప్రదించాలని ఏడీ సాగర్ తెలిపారు. కార్మికులు ఉత్పత్తి చేసే వస్త్రానికి మీటరుకు రూ.4.25 చెల్లిస్తారని వివరించారు. సిరిసిల్లలో పని లేక ఉపాధి కరువైన నేతన్నలు టెక్స్‌టైల్‌పార్క్‌కు వెళ్లాలని సాగర్ కోరారు. రాష్ట్ర చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి ఆదేశాల మేరకు నేతన్నలను ప్రోత్సహిస్తున్నామని వివరించారు.

సిరిసిల్ల బార్ అసోసియేషన్ ఎన్నికలు

సిరిసిల్లకల్చరల్: సిరిసిల్ల బార్ అసోసియేషన్‌కు ఈనెల 28న జరగనున్నాయి. రెండు రోజుల క్రితం నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. నామినేషన్ పత్రాల పరిశీలన, ఉపసంహరణల ప్రక్రియ ముగిసిన తర్వాత శుక్రవారం పోటీలో నిలిచిన అభ్యర్థుల జాబితాను ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న సీనియర్ న్యాయవాది సురభి సత్యనారాయణరావు విడుదల చేశారు. గురువారం ఎన్నికలు జరుగుతాయని, ఓట్ల లెక్కింపు, ఫలితాలను కూడా అదే రోజు సాయంత్రం ప్రకటిస్తామని తెలిపారు.

బరిలో నిలిచింది వీరే..

అసోసియేషన్ అధ్యక్ష స్థానానికి ముగ్గురు సీనియర్ న్యాయవాదులు పోటీ పడుతున్నారు. డి.సంజీవరెడ్డి, జె.శ్రీనివాసరావు, ఎస్.వసంతం, కార్యదర్శులుగా టి.వెంకటి, వి.గోవర్ధన్, సంయుక్త కార్యదర్శులుగా బి.నాగరాజుగౌడ్, పచ్చునూరి మధు, కోశాధికారిగా బిట్ల విష్ణు, చీకట్ల వెంకటయ్య, సాంస్కృతిక కార్యదర్శిగా గుడ్ల కిషన్, మొగిలి రాజు, గ్రంథాలయ కార్యదర్శిగా ఎ.సురేష్‌ప్రసాద్, జి.శశాంకం పోటీ పడుతున్నారు.

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు

వేములవాడ: స్థానిక బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్ల విత్‌డ్రాలు ముగిశాయని ఎన్నికల అధికారి విద్యాసాగర్‌రావు తెలిపారు. ఎన్నికల బరిలో నిలిచిన వారి వివరాలు శుక్రవారం ప్రకటించారు. ఈనెల 28న జరిగే ఎన్నికల్లో అడ్వకేట్లు ఓటుహక్కు వినియోగించుకోవాలని కోరారు. అదే రోజు ఫలితాలు ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వారి వివరాలు వెల్లడించారు. అధ్యక్షస్థానానికి పి.మనోహర్, జి.సదానందం, ప్రధాన కార్యదర్శికి పి.భానుకృష్ణ, ఎ.రజనీకాంత్, సహాయ కార్యదర్శికి ఆర్.రమేశ్, జి.శంకర్, లైబ్రరీ సెక్రటరీకి బి.మహేందర్, జి.మనోహర్, ఆర్.రాజ్‌కుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీకి ఎన్.సంపత్‌కుమార్, ఎస్.శ్రీనివాస్, సీనియర్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్లుగా బి.బాలరాజు, జి.రమేశ్, పి.శంకరయ్య, జె.శేఖర్, కె.శ్రీనివాస్, ఎం.సుజాత పోటీలో ఉన్నారని తెలిపారు. ఉపాధ్యక్షుడిగా పి.సంతోష్, లేడీ రిప్రజెంటేటీవ్‌గా టి.అన్నపూర్ణ, ఈసీ మెంబర్లుగా ఎస్.నవీన్, ఎస్.రాకేశ్, ఎస్.వంశీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

● ఎస్పీ అఖిల్‌మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ అఖిల్‌మహాజన్ సూచించారు. పార్లమెంట్ ఎన్నికల విధులపై జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఎన్నికల ప్రక్రియ కీలకమైందని, శాంతియుతంగా, పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. పోలింగ్‌కు ముందు రోజు నుంచి పోలింగ్ తర్వాత రోజు వరకు పోలీస్ సిబ్బంది విధుల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. నేరచరిత్ర ఉన్న వారిని, రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. అవసరమైతే ముందస్తు బైండోవర్ చేయాలన్నారు. నగదు, మద్యం పంపిణీలపై నిఘా ఉంచాలన్నారు. డైనమిక్ చెక్‌పోస్టులు పెట్టి ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని సూచించారు. సోషల్ మీడియా పోస్టులపై దృష్టి పెట్టాలని సూచించారు. ట్రెయినీ ఐపీఎస్ రాహుల్‌రెడ్డి, ఏఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

నారసింహ నామం.. పోటెత్తిన జనం



స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు



స్వామివారి ఊరేగింపు సేవ

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. మూడోరోజు శుక్రవారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక క్యూలైన్ల ద్వారా స్వామివారలను దర్శించుకున్నారు. ముందుగా పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. భక్తుల రద్దీతో సంతోషిమాత, మంగలిగడ్డ ఘాట్లు నిండిపోయాయి. సరిపడా నీడ సౌకర్యం లేకపోవడంతో గోదావరిలో ఇసుక దిబ్బలపై గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. స్థానిక ఓల్డ్ టీటీడీ కల్యాణ మండపంలో రైస్‌మిల్లర్స్, ఆర్యవైశ్యులు, ఇతర దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు.

స్వామివారి ఊరేగింపు

శుక్రవారం సాయంత్రం శ్రీలక్ష్మీనృసింహస్వామి ఊరేగింపు సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి పురవీధుల గుండా మేళతాళాల మధ్య ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల సస్పెన్షన్

● ఉత్తర్వులు జారీ చేసిన డీపీవో

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరైన జిల్లాలోని ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను శుక్రవారం సస్పెండ్ చేశారు. కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలతో జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని గుంటపల్లిచెరువు తండా గ్రామపంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న పందిళ్ల రాజు, వేములవాడ రూరల్ మండలం నమిలిగుండుపల్లి పంచాయతీ కార్యదర్శి పి.హరిప్రసాద్ గత కొన్ని రోజులుగా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా విధులకు హాజరుకావడం లేదు. దీనిపై ఆయా మండలాల ఎంపీడీవోలు విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలతో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ డీపీవో వీరబుచ్చయ్య ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

పోలీసుల అదుపులో దొంగ

చందుర్తి(వేములవాడ): ఇంట్లో చొరబడి నగదు ఎత్తుకెళ్లిన దొంగను మూడు రోజుల్లో చందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. దొంగ నుంచి నగదు రికవరీ చేశారు. చందుర్తి ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాలు. మండలంలోని కాతుబండు రాజు ఇంట్లో ఈనెల 9న రూ.1.36 లక్షలు దొంగతనానికి గురయ్యాయి. బాధితుడు రాజు ఫిర్యాదుతో ఎన్గల్‌లో శుక్రవారం విచారణకు వెళ్తుండగా.. పోలీసుల వాహనాన్ని చూసి పరుగులు పెడుతున్న బోరుగాయ అజయ్‌ని పట్టుకున్నారు. విచారించగా కాతుబండ రాజు ఇంట్లో దొంగతనం చేశానని ఒప్పుకున్నాడు. దొంగతనం చేసిన రూ.1.36 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అజయ్‌ని రిమాండ్‌కు తరలించనట్లు వివరించారు.

‘శాతవాహన ఆరోహణ-2024’లో ప్రతిభ



కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయం నిర్వహించిన ‘శాతవాహన ఆరోహణ-2024’ పోటీలో కొత్తపల్లి మండలంలోని చింతకుంట ఎస్ఆర్ఎం ఎంబీఏ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు కళాశాల చైర్మన్ ఎం.తిరుపతిరెడ్డి, ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్‌రావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1,000 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ ఫైనాన్స్ ఈవెంట్‌లో తమ విద్యార్థులు పి.దేవరాజ్, కె.ఆదర్శ్ మొదటి స్థానం కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. రోల్ ప్లేలో జె.అమృత మొదటి స్థానంలో నిలిచిందన్నారు. వీరు వర్సిటీ అధికారుల చేతులమీదుగా శుక్రవారం బహుమతి అందుకున్నట్లు తెలిపారు.

ఎస్సారెస్పీ కాలువలో గుర్తు తెలియని మృతదేహం

చొప్పదండి: పట్టణ శివారులోని ఎస్సారెస్పీ ప్రధాన కాలువలో శుక్రవారం గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యమైంది. పోలీసుల వివరాలు... రోజువారీ విధుల్లో భాగంగా స్థానిక లష్కర్ విధులకు వెళ్లగా డీ–86 రెగ్యులేటర్ వద్ద మహిళా మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు కాలువ నుండి మృతదేహం బయటకు తీయించారు. 30 నుంచి 40 ఏళ్ల వయసున్న మహిళ వారం రోజుల క్రితమే కాలువలో పడటంతో శరీరం గుర్తుపట్ట లేని విధంగా తయారైందని, ఒంటిపై మెరూన్ కలర్ ఫుల్‌టాప్, గోధుమ కలర్ చున్ని ఉందని, లష్కర్ బద్దెనపల్లి కనకయ్య ఫిర్యా దు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఉపేంద్రాచారి తెలిపారు.

లక్ష్యం.. ఆరోగ్య బాల్యం

- అతితక్కువ బరువున్న పిల్లలపై ప్రత్యేక దృష్టి
- కరీంనగర్ జిల్లాలో గర్భిణులు, బాలింతలతో కలిపి 63,692 మంది
- అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ
- 31 వరకు ‘పోషణ పక్వాడా’



చిన్నారులకు పోషకాహారం తినిపిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్: నేటి బాలలే రేపటి పౌరులు.. వారు ఆరోగ్యంగా ఉండటం ముఖ్యం. ఇదే ఉద్దేశంతో ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోంది. చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రాధాన్యం ఇస్తోంది. దీన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నా పోషణలోపంతో సతమతమవుతున్న పిల్లలు ఇప్పటికీ ఉన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన జిల్లా యంత్రాంగం పరిస్థితిలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే పోషణ పక్షోత్సవాల్లో భాగంగా పోషణ పక్వాడా కార్యక్రమాన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి 31వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తోంది.

4 ఐసీడీఎస్ ప్రాజెక్టులు..

కరీంనగర్ జిల్లాలో కరీంనగర్‌రూరల్, అర్బన్, హుజూరాబాద్, గంగాధర ఐసీడీఎస్ ప్రాజెక్టులు, 752 మెయిన్, 25 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో గర్భిణులు 4,544, బాలింతలు 14,689, ఏడాదిలోపు పిల్లలు 5,021, మూడేళ్లలోపు పిల్లలు 19,449, మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలు 19,989 మొత్తం 63,692 మంది అనుబంధ పోషకాహార లబ్ధిదారులు ఉన్నారు. వయసుకు తగ్గట్టుగా బరువు లేనివారు 8,963 మంది ఉండగా.. 1,830 మంది అతి తక్కువ బరువు ఉన్నట్లు గుర్తించారు. 5,630 మంది చిన్నారులు ఎత్తుకు తగ్గ బరువు లేరు. 2,108 మంది ఎత్తుతో పోల్చితే అతి తక్కువ బరువుతో ఇబ్బంది పడుతున్నట్లు తేల్చారు.

తల్లిపాలు పట్టడమే శ్రేయస్కరం..

తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుంది. పుట్టిన వెంటనే పాలు పట్టడం తల్లీబిడ్డలిద్దరికీ శ్రేయస్కరం. 6 నెలల వయసు వరకు అవసరాన్ని బట్టి తల్లిపాలే పట్టించాలి. ఇందులో బిడ్డకు సరిపోయే విటమిన్లు, మినరల్స్ ఉండటం వల్ల శారీరక, మానసిక వికాసం వేగంగా అభివృద్ధి చెందుతుందని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుత ఉరుకులు పరుగుల జీవితంలో కొందరు తల్లులకు తమ చిన్నారులకు పాలుపట్టే సమయం ఉండటం లేదు. డబ్బా పాలు పట్టడం ద్వారా పిల్లల్లో ఎదుగుదల లోపిస్తోంది. ఇది ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తల్లిపాల ప్రాధాన్యంపై తల్లులకు అవగాహన కల్పిస్తే సత్ఫలితాలు ఉంటాయి.

ఇదీ కార్యాచరణ..

- పోషణ లోపంతో వయసుకు, ఎత్తుకు తగ్గ బరువు లేని చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల వారీగా గుర్తించారు. ఆయా కేంద్రాల్లో వారి తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి, పిల్లల ఆరోగ్య పరిస్థితిని తెలియజేస్తారు.
- అతి తక్కువ బరువున్న పిల్లలు, వారి తల్లిదండ్రులను ప్రభుత్వ ఆస్పత్రుల్లోని పోషణ సలహా, చికిత్స కేంద్రానికి తరలిస్తారు. అవసరమైన మందులు, సలహాలు అందేలా చూస్తారు.
- ఇంట్లోనే పౌష్టికాహారం తయారు చేసుకునే విధానాన్ని వివరిస్తారు. పౌష్టికాహారలోపం వల్ల ఆరోగ్యపరంగా తలెత్తే ఇబ్బందులను తెలియజేస్తారు.
- అవసరమైన చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అదనపు పౌష్టికాహారంతోపాటు ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పెరటితోటల్లో పండించిన కూరగాయలను ఉచితంగా ఇస్తారు.
- బాలామృతం తప్పనిసరిగా తీసుకోవాలని సూచించడం, పోషకాలపై అవగాహన కల్పిస్తారు.

పోషకాహారం తీసుకోవాలి



మహిళలు బాగుంటేనే దేశం బాగుంటుంది. గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి. చిన్నారులు ఆరోగ్యంగా ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. ఏటా మార్చి, సెప్టెంబర్ నెలల్లో పోషణ్ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా పెరటి తోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నాం. న్యూట్రిషన్ ఫుడ్ తీసుకోవాలని సూచిస్తున్నాం.

– సరస్వతి, డీడబ్ల్యూవో, కరీంనగర్

ఒలింపియాడ్‌లో ‘అల్ఫోర్స్’ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్): పోటీ పరీక్షల సంస్థ ఓఎంఎస్ అకాడమీ నిర్వహించిన జాతీయ స్థాయి మ్యాథ్స్, సైన్స్ ఒలింపియాడ్‌లో కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో పి.మయాంక్‌రెడ్డి, ఎ.విహాన్‌కృష్ణ(3వ తరగతి), రహమాన్, ఆరాధ్య, క్రిషిక్ ప్రిన్స్ (4వ తరగతి) తదితరులు ర్యాంకులు సాధించి, బహుమతులు గెలుచుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపాల్, టీచర్లు పాల్గొన్నారు.

ధర్మపురిలో గుండెపోటుతో భక్తుడు మృతి



నరహరి మృతదేహం

ధర్మపురి: స్థానిక శ్రీలక్ష్మీనృసింహుని బ్రహ్మోత్సవాలకు వచ్చిన ఓ భక్తుడు గుండెపోటుతో మృతిచెందినట్లు ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలంలోని నాగంపేటకు చెందిన రటపు నరహరి(55) గురువారం ధర్మపురి నారసింహుని కల్యాణ వేడుకలకు వచ్చాడు. రాత్రి గోదావరి మంగళిగడ్డ ఘాట్ వద్ద నిద్రిస్తుండగా గుండెపోటు రావడంతో మృతిచెందాడు. ఎస్సై శుక్రవారం సంఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం బంధువులకు అప్పజెప్పారు.

వ్యవసాయ బావిలో పడి మహిళ..

ఇల్లందకుంట(హుజూరాబాద్): వ్యవసాయ బావిలో పడి ఓ మహిళ మృతిచెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. మొగుళ్లపల్లి మండలంలోని పర్లపల్లికి చెందిన జోరుక రమ(40) ఇల్లందకుంట మండలం సీతంపేటలోని బంధువుల ఇంట్లో జరిగే వివాహానికి వచ్చింది. ఆమెకు మతిస్థిమితం సరిగా లేదు. ఈ క్రమంలో శుక్రవారం స్థానిక వ్యవసాయ బావిలో పడి, మృతిచెందింది. మృతురాలి భర్త రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు..

జమ్మికుంట(హుజూరాబాద్): వ్యవసాయ బావిలో పడిన ఓ రైతు చికిత్స పొందుతూ మృతిచెందాడు. జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మండలంలోని శాయంపేటకు చెందిన లింగంపల్లి జగ్‌భూపాల్‌రావు(70) ఈ నెల 18న తన వ్యవసాయ బావిలో పూడిక తీయించాడు. ఆ సమయంలో నీళ్లు వచ్చాయా అని తొంగి చూస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడిపోయాడు. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. లోపల పని చేస్తున్న కూలీలు బయటకు తీసుకువచ్చి, కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య విజయ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఆయన బంధువు పొల్సాని సంపత్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఎండలో పని చేసి.. అస్వస్థతకు గురై అన్నదాత..



జగన్ (ఫైల్)

మానకొండూర్: మానకొండూర్ మండలం పెద్దూర్‌పల్లి గ్రామానికి చెందిన పంది జగన్ (57) రైతు వ్యవసాయ పనులకు వెళ్లి అస్వస్థతకు గురై మృతి చెందాడు. శుక్రవారం జగన్ వ్యవసాయపొలంలో ఆడ, మగ వరిపూత దులిపేందుకు వెళ్లాడు. అక్కడే అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు ఓ ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చనిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, కొడుకు ఉన్నారు.

‘అక్షయ’లో అలరించిన ఫేర్‌వెల్ డే





జ్యోతిప్రజ్వలన చేస్తున్న చైర్మన్ రవీందర్‌రెడ్డి, నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కొత్తపల్లి(కరీంనగర్): కరీంనగర్‌లోని అక్షయ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులకు శుక్రవారం ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఓ గార్డెన్‌లో ‘విదై సమారోహ–2024’ పేరిట జరిగిన వేడుకలను కళాశాల చైర్మన్ వి.రవీందర్ రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి, ప్రారంభించారు. విద్య ఆయుధం లాంటిదని, ఉన్నత విద్య కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ప్రిన్సిపాల్ జి.శైలజ, ఎస్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, లెక్చరర్లు పాల్గొన్నారు.

స్వగ్రామం వచ్చిన మరుసటి రోజే

- గోదావరి నీటి మడుగులో పడి ఒకరు మృతి



గంగారాం మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కిరణ్‌కుమార్

మల్లాపూర్(కోరుట్ల): గోదావరి నదీ తీరంలో గేదెలను మేపడానికి వెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నీటి మడుగులో పడి, మృతిచెందాడు. ఈ సంఘటన మల్లాపూర్ మండలంలోని వాల్గొండలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. పాతదాంరాజుపల్లికి చెందిన పుట్ట గంగారాం (55) తన కుటుంబసభ్యులతో కలిసి నిర్మల్ జిల్లా సోన్ మండలం మాదాపూర్‌కి వెళ్లి, కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో గురువారమే స్వగ్రామం తిరిగి వచ్చి, వాల్గొండలో గేదెలను మేపడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. శుక్రవారం గంగారాం, అతని కుమారుడు సురేశ్ గేదెలను తోలుకొని గోదావరి నదీ తీరానికి వెళ్లారు. అక్కడ ప్రమాదవశాత్తు కాలుజారి, గంగారాం నీటి మడుగులో పడి, ఊపిరాడక మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై కిరణ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని, గంగారాం మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

యువకుడి బలవన్మరణం

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. బోర్నపల్లికి చెందిన గంట కుమారస్వామి(26) మద్యానికి బానిసై, తరచూ భార్యతో గొడవ పడుతున్నాడు. ఈ క్రమంలో గురువారం అర్ధరాత్రి ఇంట్లోనే ఉరేసుకున్నాడు. మృతుడికి ఒక కూతురు ఉంది. కుమారస్వామి తండ్రి సారయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

డివైడర్‌ను ఢీకొని రైతు దుర్మరణం

- ఇద్దరికి తీవ్ర గాయాలు



రాజిరెడ్డి (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బైక్ డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ రైతు మృతిచెందగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన చందుపట్ల రాజిరెడ్డి (51) భార్య రేణుక, మనవరాలు ఊరెళ్లి, శుక్రవారం రాత్రి స్థానిక బస్టాండ్‌లో దిగారు. ఆయన వారిని బైక్‌పై కిష్టంపల్లి మీదుగా ఇంటికి తీసుకెళ్తున్నాడు. రాచర్ల గొల్లపల్లి శివారులో వాహనం అదుపుతప్పి, డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో రాజిరెడ్డి తలకు బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా ఇద్దరికి తీవ్ర గాయాలవడంతో స్థానికులు 108 వాహనంలో సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. రాజిరెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి కుమారుడు, కూతురు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

కమాన్‌పూర్(మంథని): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలంలోని రంగాపూర్‌కు చెందిన కాశెట్టి వెంకటేశ్(45) అవివాహితుడు. కమాన్‌పూర్ మండలం గుండారంలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. గురువారం అర్ధరాత్రి నడుచుకుంటూ రంగాపూర్ వస్తుండగా గుండారం రాజేంద్రనగర్ వద్ద మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి తమ్ముడు సతీశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

సిరిసిల్లలో మహిళ హత్య

- పరారీలో హంతకులు
- అడ్డా కూలీలపైనే అనుమానాలు
- దర్యాప్తు చేస్తున్న సిరిసిల్ల పోలీసులు



రమ (ఫైల్)



వివరాలు సేకరిస్తున్న సీఐ రఘుపతి

సిరిసిల్లక్రైం: సిరిసిల్ల ఉలిక్కిపడింది. కార్మికుల అడ్డా హత్యోదంతంతో తెల్లారింది. మద్యంమత్తులో ఓ మహిళను కొందరు అత్యంత కిరాతకంగా హతమార్చిన సంఘటన రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో శుక్రవారం కలకలం సృష్టించింది. స్థానికులు తెలిపిన వివరాలు. సిరిసిల్ల పట్టణంలోని అనంతనగర్‌లో బిహార్‌కు చెందిన కొందరు కూలీలు ఒక ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. బీహార్ చెందిన రాంభిక్షు సదా, రుడల్‌సదా ఉండేవారు. వీరు స్థానిక లేబర్ అడ్డా వద్ద రోజువారీ కూలీలుగా, భవనం నిర్మాణ పనులు చేసుకునేవారు. ఈక్రమంలోనే వేములవాడ అర్బన్ మండలం కొడిముంజకు చెందిన అలకుంట రమ కూలీ పని కోసం నిత్యం సిరిసిల్ల లేబర్ అడ్డాకు వచ్చేది. పనిస్థలంలో బిహార్‌కు చెందిన కూలీలతో రమకు పరిచయం ఏర్పడింది. మద్యం అలవాటు ఉండడంతో పనులు ముగిసిన తర్వాత పలుమార్లు మద్యం తాగినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. అందరూ కూలి పనులు చేసుకునే సమయంలో ఏర్పడిన చనువుతో రమ బిహార్ కూలీలు ఉంటున్న గదికొచ్చినట్లు సమాచారం. మద్యం మత్తులో రాత్రి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడి హత్య చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హత్యాస్థలంలో మద్యం బాటిళ్లు, మృతురాలి ఒంటిపై బట్టలు లేకపోవడం వారి అనుమానాలకు బలం చేకూరుస్తుంది. సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ రఘుపతి హత్యకు పాల్పడింది ఎంత మంది అనే దానిపై స్పష్టత లేదన్నారు. మూడు రోజుల క్రితం హత్య జరిగి ఉంటుందని, గది నుంచి దుర్వాసన రావడంతో హత్య విషయం వెలుగుచూసినట్లు వివరించారు. హంతకులు పరారీలో ఉన్నారని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు ఉండగా ఇద్దరి పెళ్లిళ్లు జరిగాయి. చాలా ఏళ్ల క్రితం భర్త చనిపోయినట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధురాలి మెడలోని పుస్తెల తాడు చోరీ



రోదిస్తున్న నర్సమ్మ

వెల్గటూర్ (ధర్మపురి): ఓ వృద్ధురాలి మెడలోని పుస్తెల తాడును దుండగుడు చోరీ చేశాడు. స్థానికుల వివరాల ప్రకారం.. వెల్గటూర్ మండల కేంద్రానికి చెందిన గుమ్ముల నర్సమ్మ రోజూ మాదిరిగా శుక్రవారం ఉదయం 5 గంటలకు లేచి, ఇంటి పనులు చేస్తోంది. ఆ సమయంలో వెనక నుంచి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి ఆమెపై దాడి చేసి, పుస్తెల తాడు లాక్కొని పారిపోయాడు. అరతులం పుస్తెలు దొరకగా, రెండు తులాల తాడు ఎత్తుకెళ్లాడని బాధితురాలు విలపించింది. అతను నీలం రంగు టీషర్ట్ వేసుకున్నాడని, ముఖానికి గుడ్డ కట్టుకొని వచ్చినట్లు తెలిపింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ బృందాలను రప్పించారు. నర్సమ్మతో మాట్లాడి, వివరాలు తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జగిత్యాలలో తాళం వేసిన ఇంట్లో..

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బీరయ్య గుడి ప్రాంతానికి చెందిన రాజేశం ఇంట్లో దొంగలు పడి, బంగారం, నగదు ఎత్తుకెళ్లినట్లు జగిత్యాల పట్టణ ఎస్సై నరేశ్ తెలి పారు. ఆయన వివరాల ప్రకారం.. రాజేశం ఈ నెల 19న ఇంటికి తాళం వేసి, ఎండపల్లిలో ఎల్లమ్మ బోనాలకు వెళ్లాడు. గురువారం రాత్రి తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి పరిశీలించి, నాలుగు తులాల బంగారం, రూ.5 వేలు చోరీ అయినట్లు తెలిపాడు. బాధితుడు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రేకుర్తి కంటి ఆస్పత్రికి బస్సు అందజేత



తాళం చెవి ఇస్తున్న ఎల్ఐసీ అధికారులు

కరీంనగర్: ఎల్ఐసీ కరీంనగర్ డివిజన్ తరఫున రేకుర్తి కంటి ఆస్పత్రికి శుక్రవారం రూ.25 లక్షల విలువైన బస్సును అందజేశారు. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.జగన్నాథ్ మాట్లాడుతూ.. ఎల్ఐసీ కేవలం బీమా సంస్థనే కాకుండా తన సామాజిక బాధ్యతలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. తమ గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ కార్యక్రమంలో భాగంగా పేషెంట్లను చేరవేసేందుకు రేకుర్తి కంటి వైద్యశాలకు 25 సీట్లున్న బస్సును అందించినట్లు తెలిపారు. జోనల్ మేనేజర్ శ్యాంసుందర్ మాట్లాడుతూ.. ఎల్ఐసీ సమాజంపై బాధ్యతతో 2006లో రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసి, ఇప్పటి వరకు రూ.150 కోట్ల విలువైన కార్యక్రమాలు నిర్వహించిందని పేర్కొన్నారు. అనంతరం బస్సు తాళం చెవి అందుకున్న లయన్ కొండ వేణుమూర్తి మాట్లాడుతూ.. ఎల్ఐసీ అందించిన ఈ గొప్ప కానుకను పేద ప్రజలకు వినియోగిస్తామని తెలిపారు. సంస్థ సీనియర్ డివిజినల్ మేనేజర్ ప్రసాద్‌రావు, చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరావు, మార్కెటింగ్ మేనేజర్ ఎంఆర్‌కె.శ్రీనివాస్, సేల్స్ మేనేజర్ రాజేశ్ ఖన్నా, క్లాస్–1 అధికారుల సంఘం నాయకులు చలం రాజనరేందర్, సత్యనారాయణ, వాసుదేవరెడ్డి, సత్యనారాయణ, శివప్రసాద్, రవీంద్రనాథ్, వామన్‌రావు, రామ్మోహన్‌రావు, బసవేశ్వర్, రఘువీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానం రద్దు చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కరీంనగర్: బీజేపీ అధికారంలోకి వచ్చాక విద్యను పేద విద్యార్థులకు అందని ద్రాక్షగా మారుస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ ఆరోపించారు. నూతన విద్యావిధానం–2022ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్ మంకమ్మతోటలో జరిగిన ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. నూతన విద్యా విధానం ద్వారా విద్యలో మతోన్మాదాన్ని, కులాన్ని చొప్పించే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. ఎంపీ బండి సంజయ్ కరీంనగర్‌కు ఒక్క ట్రిపుల్‌ఐటీ, నవోదయ, జిల్లా కేంద్రంలో ఉన్న శాతవాహన యూనివర్సిటీకి అధిక నిధులు తీసుకురావడంతో విఫలమయ్యారని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, సహాయ కార్యదర్శి వినయ్, నాయకులు నితిన్, అనిల్, కల్యాణ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.